క్లుప్తంగా

10న మెగా క్రికెట్ టోర్నమెంట్

సీతారామపురం : స్థానిక అరుంధతీయవాడలో ఈ నెల 10న నిత్య సహాయమాత మహోత్సవ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116 నగదు అందజేస్తున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన జట్లు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94942 86086, 94903 20715 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశం

ఉదయగిరిరూరల్: ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు పేద పిల్లల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ–1 షేక్ మస్తాన్‌వలీ సోమవారం తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించినట్లు చెప్పారు. అనాథ, హెచ్‌ఐవీ బాధిత, ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ, బీసీ,ఓసీల పిల్లలు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 15వ తేదీ లోగా గ్రామ,వార్డు సచివాలయాల్లో లేదా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం: స్థానిక ఐటీఐలో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే ఏడుకొండలు సోమవారం తెలిపారు. ఎలక్ట్రీషియన్ 40, ఫిట్టర్ 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 98667 20544, 99639 50604, 63005 99477 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేత మూలి రాఘవరెడ్డి మృతి



మూలి రాఘవరెడ్డి (ఫైల్)

కలిగిరి: మండలంలోని వీర్నకొల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉదయగిరి ఏఎంసీ మాజీ డైరెక్టర్ మూలి రాఘవరెడ్డి (77) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కలిగిరి మండల జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు రాఘవరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పార్టీల నాయకులు కూడా రాఘవరెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కాగా రాఘవరెడ్డి మరణంపై ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రాఘవరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే రాఘవరెడ్డి వంటి సీనియర్ నాయకులను కోల్పోవడం తీరనిలోటని పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

ఉదయగిరి రూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కొన్ని శాఖల అధికారులు తమ కింది స్థాయి నాల్గో తరగతి ఉద్యోగులను పంపి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా తహసీల్దార్ సుభద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్‌కు ఇకపై ప్రతి శాఖ ఉన్నతాధికారి హాజరుకావాలన్నారు. హాజరుకాని అధికారులపై చర్యలకు జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.

శిక్షణా కేంద్రం ప్రారంభం



చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎంపీడీఓ విజయలలితతో కలిసి సోమశిల ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు వేలూరి కేశవచౌదరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణను అందిస్తోందని తెలిపారు. శిక్షణానంతరం ఉచితంగా కుట్టుమెషీన్లు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐకేపీ ఏపీఎం సృజన, సిబ్బంది, చేజర్ల మాజీ సర్పంచ్ ఆర్ లక్ష్మీనరసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా కార్ల నిలిపివేత



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కార్లను అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో అధికారులతో పాటు వివిధ పనులపై వచ్చే కార్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారు కార్లను అడ్డదిడ్డంగా నిలిపివేశారు. దీంతో తహసీల్దార్ సుభద్ర, సబ్‌రిజిస్ట్రార్ మిల్కీరోషన్ తమ కార్లను బయటనిలిపి నడిచి తమ కార్యాలయాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వారు కార్యాలయంలోకి వెళ్లేందుకు అవస్థ పడ్డారు. దీంతో కార్యాలయాల సిబ్బంది స్పందించి అడ్డుగా నిలిపిన కార్ల టైర్లలోని గాలితీసివేశారు.

–ఉదయగిరి

ఐస్‌యాపిల్‌కు డిమాండ్



వింజమూరులో తాటిముంజలు అమ్ముతున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): గతంలో వేసవి వచ్చిందంటే పల్లెల్లోని పిల్లలు, పెద్దలు పొలాల్లోకి వెళ్లి బావుల్లో ఈతకొడుతూ తాటిచెట్లు ఎక్కి కాయలు కోసుకుని తాటిముంజలు(ఐస్‌యాపిల్) తింటూ సేదతీరేవారు. కానీ మారిన కాలంతో నేడు పల్లెల్లో ఆ వాతావరణం కనుమరుగవుతోంది. నేడు పట్టణాలతో పాటు పల్లెల్లోనూ తాటికాయలు కొని తినే పరిస్థితి ఏర్పడింది. తాటిచెట్లు తగ్గిపోవడం.. తాటి చెట్లు ఎక్కి కాయలు కోసే వారు లేక వాటికి డిమాండ్ నెలకొంది. దీంతో వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరి, జలదంకి, తదితర ప్రాంతాల్లో కొందరు తాటిముంజలను రూ.5 నుంచి రూ.7 వరకు విక్రయిస్తున్నారు.

మురుగు కాలువలా పంట కాలువ



మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతున్న పంట కాలువ (ఇన్‌సెట్లో) జ్యోతినగర్ వద్ద పంటకాలువలో కలుస్తున్న మురుగునీరు

ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న జ్యోతినగర్‌కాలనీ మీదుగా వెళ్లే చెరువు పంట కాలువ మురుగు కాలువలా తయారైంది. జ్యోతినగర్ కాలనీతో పాటు పలు చోట్ల డ్రైనేజీల్లోని మురుగునీటిని పంట కాలువలోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువు నీటిని విడుదల చేయని సమయంలో పంట కాలువ దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమలు విజృంభిస్తూ కాలువ పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పొలాల్లోకి మురుగు నీరు చేరడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు దెబ్బతినడంతో పాటు పొలాల్లో పనిచేసేందుకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి మురుగు నీరు పంట కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–ఆత్మకూరు

ఈత.. ఆరోగ్య ప్రదాత

- ఈతతో ఎన్నో ప్రయోజనాలు
- శారీక ఆరోగ్యం.. మానసికోల్లాసానికి దోహదం
- ఈతకొలనులకు ఎగబడుతున్న యువత, చిన్నారులు

ఉదయగిరి: వ్యాయామంతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే క్రీడల్లో ఈతకు మించినది మరొకటి లేదు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు ఈత కొట్టడం వల్ల శరీరానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఈత చక్కని శరీర ఆకృతిని ఇస్తుంది. కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణకు దీన్ని మించిన దివ్యౌషధం మరొకటి లేదనడంలో అతిశయోక్తి లేదనే చెప్పాలి. అందుకే గతంలో జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మున్సిపాలిటీలకే పరిమితమైన ఈత కొలనులను నేడు మండల కేంద్రాల్లో సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరులో ఈతకొలనులను ఏర్పాటు చేసి గంటల ప్రాతిపదికపైన అద్దెకు ఇస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో ఈత కొలనుల వైపు చిన్నారులు, యువకులు, పెద్దలు దృష్టి సారిస్తున్నారు. ఈతతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ముడిపడి ఉన్నందున వేసవిలో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈత రాని వారు సరదాగా ఈత ఆడడం నేర్చుకుంటున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈత కొలనులు బీజీగా మారాయి. వింజమూరులోని హిందూనగర్, గంగమిట్ట ప్రాంతాల్లో ఉన్న ఈతకొలనులకు మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రతిరోజు వందల సంఖ్యలో ఈత కొట్టే వారి సంఖ్య ఉంది.

ప్రయోజనాలు

పిల్లలకు ఈత ఒక ఆట. పెద్దలకు మాత్రం ఆది ఆరోగ్య ప్రదాత. నిత్యం కనీసం 30 నుంచి 45 నిమిషాలు ఈత కొడితే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చు. ముఖ్యంగా ఊబకాయం సమస్య ఉండదు. షుగర్, బీపీతో బాధ పడుతున్న వారికి ఈత ఎంతో మేలు చేస్తోంది. గుండె పనితీరును మెరుగుపరిచి గుండె జబ్బులను నియంత్రిస్తుంది. కండరాలను బలంగా ఉంచడంతో పాటు కీళ్ల సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో నీటితో ఇబ్బందులు వచ్చినప్పుడు తన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించవచ్చు.

క్రీడల్లో రాణింపు

ఈతను ఒక క్రీడగా మార్చుకుని సాధన చేస్తే అనేక లాభాలు ఉన్నాయి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. అందులో రాణించిన వారికి అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి అవకాశాలు ఉంటాయి. ఆసియా, ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.



వింజమూరులోని ఓ ఈతకొలనులో ఈత కొడుతున్న చిన్నారులు

జాగ్రత్తలు అవసరం

- సాధారణంగా ఈత కొలను 3 నుంచి 10 అడుగుల మేర లోతు ఉంటుంది. పిల్లల భద్రత దృష్ట్యా లైఫ్‌జాకెట్లు తొడిగించి కొలనులో దించాలి.
- ఐదేళ్ల పైబడిన వారిని మాత్రమే ఈత కొలనుల్లో అలవాటు చేయాలి. వీరికి తమను తాము రక్షించుకునేందుకు శిక్షణ ఇస్తారు.
- నెల నుంచి 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకుంటే నీటి ప్రమాదాల బారి నుంచి బయటపడొచ్చు. ఆదే అలవాటుగా మార్చుకున్న వారు భవిష్యత్తులో ఆనేక జలక్రీడల వైపు అడగులు వేసేందుకు అవకాశం ఉంటుంది.
- బాలురు నైలాన్ షర్టు, టోపీ, స్విమ్మింగ్ కళ్ల జోడుతో ఈతకు దిగాలి. అదే బాలికలకు ప్రత్యేకంగా స్విమ్ సూట్లు మార్కెట్‌లో ఉన్నాయి.
- కొలనులో దిగే ముందు ఆ తర్వాత ఖచ్చితంగా స్నానం చేయాలి.

ఈత అద్భుతమైన క్రీడ



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి క్రీడకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఈతకు మంచి ప్రాధాన్యత ఉంది.ఈ క్రీడలో రాణించే వారు శారీరకంగా, మానసికంగా ఎంతో దృఢంగా ఉంటారు. కేవలం చిన్నారులే కాకుండా పెద్ద వారు కూడా ఈత కొట్టడం ఎంతో మంచిది.

– రజనీ విలాసిని, వ్యాయామ ఉపాధ్యాయిని, వింజమూరు.



బావిలో ఈత కొడుతున్న చిన్నారులు

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



సంగం: మండలంలోని సిద్దీపురంలో పోలేరమ్మ గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ ఉత్సవమూర్తిని పూలతో విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: నెల్లూరులోని నివాసంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఆత్మకూరుకు చెందిన రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తన నియామకానికి కృషి చేసినందుకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి అల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పేదల పక్షపాతి కలికి యానాదిరెడ్డి



కలికి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీనాయకులు, అభిమానులు

కావలి(జలదంకి): కావలి నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసి పేదల నాయకుడిగా స్వర్గీయ కలికి యానాదిరెడ్డి పేరు తెచ్చుకున్నారని కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని ఉదయగిరి బ్రిడ్జ్ సెంటర్‌లోని కలికి యానాదిరెడ్డి విగ్రహం వద్ద ఆయన 19వ వర్ధంతిని కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కలికి అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కలికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జమ్మలపాళెం సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన యానాదిరెడ్డి 30 ఏళ్ల పాటు కావలి రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. పేదలకు అండగా ఉండేందుకే ఆయన ఎక్కువ మక్కువ చూపేవారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి రాజకీయ నాయకుడు అనుసరించాలన్నారు. అనంతరం కావలి ఏరియా వైద్యశాలలో అన్నదానం చేశారు. అలాగే కలిగి యానాదిరెడ్డి విగ్రహానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి టీడీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిత్రకళలో ప్రతిభకు ప్రశంసలు



మర్రిపాడు: చుంచులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శివశంకరయ్య దారపు చిత్రకళ ప్రతిభను ప్రముఖ సినీనటుడు బాబుమోహన్ నెల్లూరులో ఒక వసతిభవనంలో తిలకించి అభినందించారు. తాను గతంలో ఎప్పుడూ ఇలాంటి దారపు చిత్రకళను చూడలేదని, దారం ఎక్కడ ప్రారంభించారో, అక్కడే అంతమయ్యే విధంగా చేయడం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఈ సందర్భంగా బాబు మోహన్, వారి కుమారుడు దివంగత పవన్‌కుమార్ దారపు చిత్రాలను శివశంకరయ్య రూపొందించి అందజేశారు. పవన్‌కుమార్ చారిటబుల్ ట్రస్టు మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాటేపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి సర్పంచ్ ఎం విజయలక్ష్మమ్మ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దుచేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయానికి కలెక్టర్ ఉత్తర్వులు సోమవారం అందాయి. గతంలో పంచాయతీ కార్యదర్శిగా ఉన్న ప్రసన్న, సర్పంచ్ మధ్యన విబేధాలు ఉన్నాయి. ఈ నేప థ్యంలో పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ పలు ఆరోపణలు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు కార్యదర్శి రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు కొంత మొత్తం నగదును నిబంధనలకు వ్యతిరేకంగా డ్రా చేసినట్లు విచారణలో తేలడంతో సస్పెండ్ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కొందరు గ్రామస్థుల ద్వారా సర్పంచ్‌పై పలు ఆరోపణలు చేస్తూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కందుకూరు డీఎల్‌పీఓ విచారణ చేసి తుది నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. పలు పనుల తీర్మానాలకు సంబంధించి హ్యాబిటేషన్ కమిటీ ఎంపికలో నిబంధలను పాటించకపోవడం, పలు అంశాలకు సంబంధించిన విషయాలు నిజాలుగా తేలడంతో చెక్ పవర్ రద్దు చేశారు. కాగా ప్రస్తుతం పంచాయతీ ఖాతాలో సుమారు రూ.28 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయి.

వెంగమాంబ సన్నిధిలో టెండర్లు



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో సీల్డ్‌టెండర్లు, తాత్కాలిక దుకాణాలకు వేలం పాటలను సోమవారం నిర్వహించారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా రంగులు వేయడం, విద్యుద్దీపాలంకరణ, షామియానాల ఏర్పాటు, బాణసంచా కాల్చడం, పుష్పాలంకరణ, జంగిల్ క్లియరెన్స్, తదితరాలకు సీల్డు టెండర్లు నిర్వహించారు. వాటిని తక్కువ కోట్ చేసిన వారు దక్కించుకున్నారు. అలాగే తాత్కాలిక దుకాణాలకు వేలం నిర్వహించగా ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల సురేష్‌బాబు, పచ్చవ కరుణాకర్‌బాబు, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి గణపం రమణారెడ్డి, ఆలయ ఈఓ ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి స్లాట్ బుకింగ్ విధానం



ఉదయగిరి : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ మెల్కిరోషన్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇకపై ప్రజలు కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పనిలేదన్నారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని వెళ్లవచ్చని తెలిపారు. రోజుకు 36 స్లాట్స్ ఇచ్చారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కూటమి ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానానికి వ్యతిరేకంగా ఉదయగిరిలో ఏపీటీఎఫ్ అధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నిష్పత్తి ఉండాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో ఉన్న అసంబద్ధ విధానాన్ని సరిచేయాలని కోరారు. గత ప్రభుత్వ విద్యా విధానంతో ఎన్నో ఇబ్బందులు ఉన్నందున ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి దించితే ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణితో ఉందని విమర్శించారు. పూర్వపు విద్యా విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వేసి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.అనంతరం తహసీల్దార్ సభద్రకు వినపతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నేతలు డీ మాల్యాద్రి, ఎండీ ఖాజా, ఎస్ ఓబులేసు, షబ్బీర్, నాగేశ్వరరావు, రమేష్, మాధవరాజు, మాల్యాద్రి, బాలకృష్ణ, రామసుధాకర్, సురేష్‌బాబు, ఉదయగిరి, సీతారామపురం,వరికుంటపాడు,దుత్తలూరు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుపూరు కాలువకు నీటి విడుదల



సంగం: సంగం బ్యారేజ్ నుంచి కనుపూరు కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. కనుపూరు కాలువ చైర్మన్ మస్తాన్‌నాయుడు, డీఈ పాండురంగారెడ్డి కనుపూరుకాలువ రెగ్యులేటర్ వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశువులకు తాగునీరు, నారుమడుల అవసరాలకు వంద క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని తెలిపారు. సోమశిల నుంచి నీరు విడుదల చేసిన వెంటనే రెండో పంటకు ఐఏబీ సమావేశంలో కనుపూరు కాలువకు కేటాయించిన మేరకు నీటిని వదులుతామన్నారు. కనుపూరు కాలువ ఏఈ వాసు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు చుట్టూ కంపచెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఉదయగిరిరూరల్: మండలంలోని గండిపాళెం బీసీకాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు చుట్టూ దట్టంగా కంపచెట్లు దట్టంగా పెరిగి విషపురుగులకు నిలయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఈ నెల 3న 'సాక్షి'లో 'కంపచెట్లను తొలగించరూ' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సర్పంచ్ గొల్లపల్లి కల్పన స్పందించారు. సోమవారం జేసీబీను ఏర్పాటు చేసి ట్యాంకు చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించారు.